# అనుమానం పెనుభూతం

కదానిక ★ శ్రీమతి ఎ. వి. రమణ

విజయ ఇంటర్ మొదటి సంవత్సరమే పూర్తి చెయ్యగలిగింది. రెండవ సంవత్సరం విధిగామానవల్సివచ్చింది. కారణం? తను చదువుతున్న కాలేజీలెక్చరర్ మూర్తిరాజుకూ తనకూ పెండ్లి కావడం. అతనేమీ అభ్యంతరం చెప్పలేదు. తనే సిగ్గయి మానేసింది. ఇద్దరూ వలచివలపించుకొనే పెండ్లి చేసుకున్నారు. ఆదర్శసంసారపు బండిని అతి హుషారుగాలాగేస్తున్నారు. రాజు, స్త్రీకి స్వేచ్ఛవుండాలనీ, స్త్రీని ఒక బానిసలా చీడపురుగులా చూడకూడదనే అభిప్రాయాలుకలవాడు. ఆ విధంగానే ఉపన్యాసాలు ఇచ్చేవాడు. మాటలు కోటలు దాటి కాళ్లు గడపదాటకపోతే బాగుండదని, తన ఇల్లాలుకుకూడా పూర్తి స్వాతంత్రం ఇచ్చేశాడు. తన స్వేచ్ఛను మాత్రం దుర్వినియోగం చెయ్యడం లేదు విజయ. ఏదైనా ఒక సద్గుణాన్ని ఆరాధించాలంటే తప్పక పరీక్ష వచ్చి తీరుతుంది. పరీక్షప్యాసైతేగా పైకి పోవడం? స్కూల్లో పరీక్షకాదులెండి, దైవ పరీక్ష. అట్లాగే అనుకోకుండా రాజుకు పరీక్షా సమయం వచ్చింది. అదొక సాయంసమయం, రోజూవలె ముస్తాబై ముందు హాల్లో భర్తరాకకు ఎదురుచూస్తు ఒక సోఫాలో కూర్చుంది విజయ. ఇంతలో తన బాల్య మిత్రుడు ఆనంద్ వచ్చాడు. సంభ్రమ ఆశ్చర్యాలతో లేచి ఎదురువచ్చి, "అన్నయ్యా! నీవా? అబ్బా! ఎన్నాళ్లకు కనపడ్డావ్. ఎక్కడనుంచీ రావడం?" అంది. ఆమె కన్నులు ఆనందంతో చెమ్మగిలాయి. 'ఈ వూళ్లోనుంచేనమ్మ!' 'చాలా రోజులైంది నిన్ను చూసి, అలా కూర్చో' అని ఒక సోఫానూపించింది. అందులో ఆసీనుడయాడు ఆనంద్. అతని కెదురుగా తనూ ఒక సోఫాలో కూర్చుంది. 'మా ఇల్లు ఎలా తెల్సిందీ? ఎంత ప్రేమగా ఒకర్ని ఒకరు విడవకుండా వుండేవాళ్లమో అంతకంతా దూరం అయిపోయాము. వుద్యోగరీత్యా నీవు చాలాదూరం వెళ్లిపోవడం, చదువు నిమిత్తం నేనిలా వూరు వూరు తిరగడం అనుకోనంత దూరం అయిపోయాము. ఈ వూరు ఏదైనా పని మీద వచ్చావా?' 'ఆ వుద్యోగంలో ఏమీ సుఖంలేదమ్మా! కష్టానికి తగిన ఫలితం లేదు. ఈ వూళ్లో ఏదైనా వ్యాపారం చెయ్యాలని వచ్చాను. ఈ వూరు వచ్చాకే నీవు ఇక్కడ వున్నట్లూ పెండ్లి అయినట్లూ తెల్సింది. బావా నీవూ కులాసాగా వున్నారా?' 'ఆ కులాసాగానేవున్నాము. బావ చాలా మంచివారు, అయితే ఈ వూరువచ్చి ఎన్నాళ్లయిందీ?' 'రెండు రోజులైంది. ఒక స్నేహితుని ఇంట్లోవున్నాను.' ఉండు కొంచెం కాఫీ తెస్తా, అని లోపలికి వెళ్లి ఓ కప్పులో కాఫీ తెచ్చి అన్నగార్ని సత్కరించింది విజయ. వారిద్దరూ స్వంత అన్నాచెల్లెళ్లుకారు. ఒక కులమే కాదు. కాని వారి సోదర ప్రేమ అటువంటిది. పవిత్రమైనది. అలా వారిరువురూ కష్టసుఖాలు వెళ్లబోసుకుంటున్నారు. రోజూ వీధిగుమ్మంలోంచే వచ్చే రాజు ఆ రోజు దొడ్డి తలుపు తీసివుందని అలా వచ్చాడు. సావిట్లోంచి, తన రాణి ఏం చేస్తోందో అని తొంగి చూశాడు. అతనికి కనుపించిన దృశ్యం ఇది. సోఫా దగ్గరనుంచుని టేబిల్ మీదుగా విజయ చేతులు అందుకొని 'బజార్లోకి వెళ్లివస్తా' అని వెళ్లి పోయాడు ఆనంద్. అతను వెళ్లిపోయిన వైపే చూస్తోంది విజయ. మనసుకు దాసులముగా—అది చెప్పే పని ఉచితమో అనుచితమో ఆలోచించే దాకా ఆగము. బలే సమయమని ఈర్ష్య, కోపం, అనుమానం ఇలాంటి పిశాచాలన్నీ అమాంతంగా అతని బుఱ్ఱలోకి వురికి శరీరమంతా ప్రాకి మాకేదైనా పని చెప్పు అంటున్నాయి. ఉచితా నుచితాలు ఆలోచించడానికి బుద్ధి పూర్తిగా సన్నగిలి పోయింది రాజుకు. తన దృష్టిలో విజయ ఒక కులట అయిపోయింది. అమాంతంగా విజయను చంపెయ్యాలనుకున్నాడు. అధమం చచ్చేలా కొట్టాలనుకున్నాడు. అలా చెయ్యడానికి కూడా మనసు స్వాధీనంలో లేక వచ్చిన దారినే ఇవతలికి వచ్చేశాడు. ఎక్కడికో వెళ్లి పోవాలనుకున్నాడు, కాని మళ్లీ వీధి

గుమ్మంల్లోంచి లోపలికి ప్రవేశించాడు. రోజూవలె చిరునవ్వుతో ఎదురువచ్చింది విజయ. భర్త ముఖంలో కోపపు క్రీడలు చూసి ఒక నిట్టూర్పువిడిచి ముఖంవంచేసుకుంది. త్రాచుపాములా బుసలు కొడుతూ గదిలోకి వెళ్లిపోయాడు. అతన్ని అనుసరించింది. గదిలో ఒక టేబిల్‌ను ఆనుకొని నించుని గాబరాపడుతూ చూస్తోంది భర్త ముఖంలోకి. చేతులో పుస్తకం దూరంగా గిరాటువేసి చురచురా విజయకేసి చూస్తు—'ఎంత మంది వున్నారు నీకు ఎన్నాళ్లనుంచి నన్ను మోసం చేస్తున్నావూ?' అన్నాడు. అతని పరిస్థితి అర్థం చేసుకుంది. పైకి వస్తున్న కన్నీటి పొరల్ని అణిచి అమాంతంగా ధైర్య లక్ష్మిని లాక్కువచ్చి హృదయ పీఠంమీద కూర్చోబెట్టుకుంది. 'ఎప్పుడూ రానటువంటి నీచపు మాటల్ని వుచ్చరించి, నోరుపాడు చేస్కోకండి, ఎవరు చెప్పేరు మీకు?' 'ఎవరు చెప్పడమేమిటీ? నా కళ్లల్లోనే కారం జల్లుతున్నావు. ఛీ! చదువుకొన్న ఆడదాన్ని పెండ్లి చేసుకోమని ఎవడు చెప్పాడూ?' 'చదువు గుణాన్ని చెరుపదు' అంది తడబడుతూ. 'వళ్లు దగ్గర పెట్టుకు మాట్లాడు. భారత స్త్రీవి కాదూ? భర్తను ఎదిరించడం భారత స్త్రీ ధర్మంకాదు. భర్త వుండగా—నిన్నేం చేసినా అనే వాళ్లు లేరు. నీవు కూడా ఏమీ చెయ్యలేవు'. 'అవును భారత స్త్రీనే, మిమ్మల్ని ఏమీ చెయ్యలేను. భారత స్త్రీ పురుషుడు చేసే అన్యాయాలను సహించేది. పురుషుని దృష్టిలో బానిస, చీడపురుగు. ఆమె నటువంటి స్థితికి మీ పురుషులే తీసుకువచ్చారు. భర్త చేసే అన్యాయం సహించడమేగాని సరిదిద్దే తెలివిలేని అమాయకురాల్ని చేసింది సంఘం. పురుషుణ్ణి తానేమీ చెయ్యలేదు కుళ్లికుళ్లి ఏడ్వడం తప్ప, అది సహించలేక పోతే నుయ్యోగొయ్యో చూసుకొని తానే చావడం. ఇటువంటి వెఱ్ఱిది భారత స్త్రీ. తాను తప్పు చెయ్యడమే కాకుండా భార్యను చావగొట్టి వస్తువులన్నీ లాక్కుని తమ ప్రేయసికి అలంకరించడం. అదే స్త్రీ అయితే అమాంతంగా ప్రాణాలు తీస్తారు. అలా చెయ్యని వారు నానా హింసలూ పెడతారు. భర్త అనుమానానికి గురియై నిర్దోషి అయిన స్త్రీ వుంటే ఆమెకీ ఈ పాట్లు తప్పవు. అనుమానం కల్గితే చాలు ఉచితానుచితాలు ఆలోచించకుండా తొందర పన్లు చెయ్యడం. ఆతరువాత పశ్చాత్తాప పడడం. ఇలాంటివి తరచు జరుగుతూనే వుంటాయిబానిస కాబట్టేగా. ఇది చాలా అన్యాయం. స్త్రీకి జరుగుతున్న అన్యాయాలలో ఇదొకటి, నేనీ విషయంలో పురుషుల్ని హెచ్చరించే దేమిటంటే మొదట తొందరపడి ఏమీ చెయ్యవద్దని. దోషియో నిర్దోషియో నిదర్శన పూర్వకంగా తెల్సుకొని మసిబొగ్గు అయితే విసర్జించమనీ, మాణిక్యమైతే స్వీకరించమనీ. హింసమాత్రం కూడదు. హింసించి మంచి మార్గంలోకి తీసుకురాలేము. మసిబొగ్గు కదా అని చితగ్గొడితే తమ చేతికి కూడా మసి అంటుకుంటుందన్న విషయం గుర్తువుంచుకోవాలి. చేతనైతే మంచి మార్గంలోకి తీసుకురావాలి. లేక పోతే విసర్జించాలి. హింసించడం—' ఇంక చెప్పలేక పోయింది. ఆమె పెదవులు అలసిపోయాయి. 'చాల్లే నోరుముయ్యి, చదువుకొన్న తెలివి తేటలు ఇందుకు పనికి వచ్చాయి. పురుషుల్ని దెప్పడానికి. నా కళ్లారా చూసిన దానికి ఏం చెబుతావూ? ఈ మాటకు నిలువునా నీరైపోయింది. ' చూసారా? ఏం చూసారూ?' అతనికి దగ్గరగా వచ్చి రెండు చేతూలూ పట్టుకొంది. విదలించి పారేసాడు. మళ్లీ పట్టుకొంది. 'రాజుగారూ తొందరపడకండి. మీ మంత్రి నేనన్న విషయం మర్చిపోకండి. రాజు ఏ పని చేసినా మంత్రి సలహా లేనిదే చెయ్యకూడదు. నిజంగా మీరన్నట్లు ఈ శరీరమే కనుక దోషి అయితే క్షమించడానికి వీల్లేదు. మీరు తొందరపడితే మీకు నాకు కూడా చాలా నష్టం. ఈ శరీరం ఎటువంటిదో బాగా యోచించి దీనివల్ల దోషమే కనుక వుంటే మీదాకా ఎందుకూ నేనే తగిన శిక్ష విధిస్తా' అంది భర్త కన్నులలోకి చూస్తూ. ఆ వెలుగు చూడలేక పోయాడు. ఆమె వింత ధోరణికి విస్తుబోయాడు. ఆమె మళ్లీ దూరంగా వెళ్లిపోయింది. నిజంగా నిర్దోషియేమో అనుకుంటూండగా అతన్ని ఆవరించిన పిశాచాలన్నీ ఇంక లాభంలేదని ఎగిరిపోయాయి. శాంతి దేవత ప్రవేశించింది. కోపం, ఈర్ష్యగాయం చేసిపోయిన అతని హృదయాన్ని చక్క జేస్తోంది శాంతి దేవత. అబ్బా! శాంతిలో ఎంత హాయివుంది! కోపం, ఈర్ష్య, అనుమానం ఇటువంటి పిశాచాలు మన హృదయాలకు తీవ్రమైన గాయం చేస్తాయని తెల్సుండీ కూడా ప్రవేశమిస్తాము. ఎంత తెలివి

తక్కువో—విమర్శగా రెప్పవాల్చకుండా చూస్తున్నాడు, విజయ ముఖంలోకి, ఆమె దూలాలవైపుచూస్తోంది. ఏమిటో ఆలోచిస్తు లోలోపల ఏమిటో గొణుగుతోంది. 'కర్నేషు మంత్రీ' అని అస్పష్టంగా కొంచెం వినిపించింది. ఆమె భావగర్భితం మాటలు అప్పుడు అర్థం చేసుకున్నాడు. నాదే తప్పేమో, అయితే అతనెవరూ? ఇలా ఆలోచిస్తున్నాడు రాజు. ఇంతలో ఆనందంతో ఆనంద్ వచ్చాడు. బావ గారూ ఇంటాకా వచ్చాను. మీ దర్శనం కాలేదు. చెల్లి చెప్పింది ఆనందంగా జీవితం గడుపుతున్నానని. మీకు బహుమానంగా ఈ వుంగరం షాప్‌లో కొని తెచ్చా. అని చనువుగా దగ్గరికివచ్చి వ్రేలుకు పెట్టబోయాడు. అప్పుడు బాగా పరిశీలించి చూసాడు. రాజు ముఖం తీక్ష్ణంగావుంది. తరువాత విజయ కేసి చూసాడు, గంభీరంగావుంది ఆమె ముఖం. మనసులో ఏది వుంటే అది పైకి అనేసేస్వభావం కలవాడు ఆనంద్. ఏ పని చేసినా త్రికరణశుద్ధిగా చేయడం అతనికి అలవాటు. ఆ అలవాటు చొప్పున ఇదేమిటి చెల్లీ! బావగారు మాట్లాడరేం? ఇద్దరూ దెబ్బలాడుకొన్నారా? బావ మంచి వారని చెప్పావేం మరి అన్నాడు. ఆ మాటకు కత్తి వాటుకు నెత్తురు చుక్కలేకుండాపోయింది రాజు ముఖం. తన తప్పు అద్దంలో కన్పించినట్లు అయింది. అతని అంతర్వాణి నీదే తప్పు అని ఎలుగెత్తి చెప్పినట్లు అయింది. చిరునవ్వునవ్వుతూ 'అబ్బే మిమ్మల్ని ఎక్కడా చూడలేదు. ఎవరా అని ఆలోచిస్తు మాట్లాడలేకపోయా. భోజనానికి లేవండి' అన్నాడు రాజు. విజయా వోడిపోయా. నీదే విజయం అన్నట్లు చూసాడు విజయ కన్నులలోకి. విజయోత్సాహంతో చూసింది విజయ. భర్త పెదవులపై చిరునవ్వుచూసి తన పెదవులకూ అదే పని చెప్పి, 'విశేషాలు తరువాత మాట్లాడుకుందాం అన్నయ్యా! భోజనానికి లేవండి' అని వంట గదిలోకి వెళ్ళిపోయింది. అందరి హృదయాలూ తేలికపడ్డాయి. ఆనందంగా గడిపారు రెండు రోజులు. మూడవ రోజు ఆదివారం, మళ్లీ సాయంకాలం వచ్చిది. ఎక్కడనుంచో హడావిడిగా వచ్చాడు రాజు. విజయతో ఈ రోజు నదిదాటి ఇసుక తిన్నెమీదకు విశ్రాంతికి పోదాం నావ సిద్ధంగావుంది. ఏదైనా టిఫెన్ సిద్ధంచెయ్యి, అని మళ్లీ వెళ్ళిపోయాడు. రోజూకంటే ఎక్కువ ముస్తాబైంది విజయ. వంటగదిలోకివచ్చింది. ఆ రోజు పలహారాలు ఏమీ చెయ్యలేదు. ఆలోచనలచే బరువుగా నాల్గువైపులా చూసాయి కన్నులు. చక్కని ఉపాయం తట్టింది. ఒక దానిలోంచి నాల్గుతీసి పొట్లం కట్టింది. కాఫీకి బదులు నిమ్మరసం వేసిన మజ్జిగతేట సిద్ధం చేసింది. ఇంతలో ఆనందం రాజూ వచ్చారు. ముగ్గురూ నావదాటి ఇసుక తిన్నెలోకివచ్చి కూర్చున్నారు. ఇసుకలో కాళ్లు ఆడిస్తు ఏమిటో కబుర్లు చెబుతోంది విజయ. 'ఆ తెచ్చిన ఫలహారమేదో ఇలాపడెయ్యి' తింటూ చెప్పకోవాలి అన్నాడు రాజు. సందేహంలేకుండా పొట్లంవిప్పి ఒక వూరగాయటెంక రాజుకూ, ఒకటి ఆనంద్‌కీ ఇచ్చి ఒకటి తను తీసుకుని చప్పరించడం మొదలు పెట్టింది. రాజూ, ఆనంద్ విరగబడి నవ్వడం మొదలుపెట్టారు. తనూ నవ్వి ఇంకా పెదవుల మీదకు తరుముకువస్తున్న నవ్వు ఆపుకొని కోపాన్ని నటిస్తూ కొంటె చూపులతో 'చాల్లెండి, అపురూపమైన ఫలహారం తెస్తే హాస్యంచేస్తున్నారా?' అంది. రాజు కొంచెం నవ్వు ఆపుకొని 'హాస్యంకాదు, నీ సమయస్ఫూర్తికి నవ్వుకొంటున్నాం.' 'సరేలెండి, అపురూపం ఎట్లా అయిందో సెలవియ్యండి?' "ఇంకా అలా అడగండి చెబుతా! అకాలంలో అపురూపంగా మామిడిపరిమళ మధురస్మృతిలో పుల్లని రసంబుతో, సముద్రుని ఘనతలో ఇంగువ కీర్తితో నాలుకకు వింజామర వీచే పీచుతో చచ్చిన జిహ్వాల బ్రతికించే మాగాయటెంక తెల్సా?' 'చాలా బాగుంది నీవు తెచ్చిన మాగాయటెంకరసంతోటే కడుపు నిండిపోతే ఈ కవితారసానికి చోటేదీ? ఉదయంలో చోటుచేసుకోండి విశాల హృదయమైతే సరి, అంది కిలకిలా నవ్వుతూ. వారూ నవ్వుకొన్నారు. వీరి నవ్వులు చూడ్డానికి పున్నమ నిండు చందమామ వచ్చాడు. అతనికి తమ చూపులతో స్వాగత మిచ్చారు. అతని ఛాయలు నీళ్లలో మెరుస్తుంటే భగవంతుని చిత్రాలకి ఆనందిస్తు తన్మయులై వున్నారు. ముగ్గురి చూపులూ చందమామ యందు లగ్నమైవున్నాయి. ముగ్గురి హృదయాలూ చందమామను సృష్టించిన భగవంతుని ధ్యానంలో వున్నాయి. ఆపదలో మాత్రమే భగవంతుని పిలవడం కాదు. ఆనందంలోకూడా పిలవాలి మన హృదయాలలోనికి. ఏమంటారూ?

★